
రిక్కాబజార్ స్కూల్ వద్ద కోడ్ అతిక్రమించారని పీఆర్‌టీయూ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు




# పోలింగ్ ప్రశాంతం

- 'ఖమ్మం'లో 93.05 శాతంగా టీచర్స్ ఎమ్మెల్సీ ఓటింగ్ నమోదు
- పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారంతో ఉపాధ్యాయ సంఘాల ఆందోళన
- పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఖాన్, సీపీ దత్
- పోలింగ్ అనంతరం నల్లగొండ ఆర్‌సీకి బ్యాలెట్ బాక్సుల తరలింపు



ఖమ్మం, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఖమ్మం జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం-నల్లగొండ-వరంగల్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఖమ్మం జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. గురువారం ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. బ్యాలెట్ పద్ధతిన ఈ ఎన్నికల ప్రక్రియ జరిగింది. జిల్లాలో 93.05 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. మొత్తం 4,089 మంది ఓటర్లకుగాను.. 3,805 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.





సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

### పోలింగ్ కేంద్రాల్లో కలెక్టర్, సీపీ తనిఖీ..

జిల్లాలో పోలింగ్ సరళిని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం ఓట్లు 4,089 ఉండగా.. వాటిల్లో కేవలం ఖమ్మంలోని రిక్కాబజార్ పాఠశాల కేంద్రంలోనే 1,986కి పైగా ఓట్లు ఉన్నాయి. అందుకని ఈ కేంద్రాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా సందర్శించారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ప్రక్రియను, ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ తనిఖీ చేసిన తర్వాత అదే కేంద్రాన్ని సీపీ సునీల్ దత్ కూడా తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఖమ్మం అదనపు డీసీపీ ప్రసాదరావు, నగర ఏసీపీ రమణమూర్తి కూడా పలు కేంద్రాలను పరిశీలించారు.

### ఉత్సాహంగా పోలింగ్..

ఉదయం నుంచే ఉత్సాహంగా మొదలైన పోలింగ్.. చివరి సమయంలో ఇంకా ఊపందుకుంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత టీచర్లు ఓటు హక్కు ఎక్కువగా వినియోగించుకున్నారు. అత్యధిక పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం వరకు 54 శాతం పోలింగ్ జరగ్గా.. సాయంత్రం 4 గంటల వరకు 93.05 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 10 గంటలకు 20.35 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 54.34 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 79.53 శాతం, సాయంత్రం 4 గంటలకు 93.05 శాతం పోలింగ్ నమోదైంది. కాగా, కౌంటింగ్ ప్రక్రియ నల్లగొండలో ఉన్నందున ఇక్కడ ఎన్నికలు పూర్తయ్యాక బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రత మధ్య నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్(ఆర్‌సీ)కి పంపించారు.


ఓటు వేసి గుర్తు చూపిస్తున్న టీచర్లు




రిక్కాబజార్ స్కూల్‌లో ఓటు వేయడానికి క్యూలో ఉన్న టీచర్లు

### ఉపాధ్యాయ సంఘాల ఆందోళన..

ఖమ్మం రిక్కాబజార్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 10 గంటల ప్రాంతంలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పార్టీ గుర్తులు, పార్టీ ఫ్లెక్సీలతో ప్రచారం చేశారు. అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డికి అనుకూలంగా పోలింగ్ బూత్ వద్ద ప్రచారం చేస్తున్నారని యూటీఎఫ్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలింగ్ కేంద్రం సమీపంలో ప్రచారం నిర్వహించకుండా పోలీసులు వారిని పంపించివేశారు. దీనిపై ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ ఫ్లెక్సీలను తొలగించారు. అయితే, పోలీసులు కొందరికి సహకరిస్తున్నారన్న ఆరోపణలతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పోలీసు వాహనం ఎదుట బైఠాయించారు. కొంతసేపు ఆందోళన చేశాక పోలీసులు సర్దిచెప్పి పంపించారు.

## పట్టుదలతో చదివితే మంచి ఫలితం

- వార్షిక పరీక్షల నేపథ్యంలో సమయం వృథా చేయొద్దు
- గొప్పస్థాయికి ఎదిగేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలి
- ఏన్కూరులో తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల తనిఖీలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


పరీక్షల సన్నద్ధతపై ప్రశ్నిస్తున్న కలెక్టర్ ఖాన్

వైరా టౌన్(ఏన్కూరు), ఫిబ్రవరి 27 : వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు సమయం వృథా చేయకుండా పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాంక్షించారు. కలెక్టర్ ఏన్కూరులోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను గురువారం తనిఖీ చేశారు. రెసిడెన్షియల్ పాఠశాలలో డార్మెటరీ, హాల్, కిచెన్, భోజనశాల, ప్రహరీ, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి పరీక్షల సన్నద్ధతపై చైతన్యపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగేలా లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. రాబోయే నెల రోజులపాటు విద్యార్థులు సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, పూర్తి సమయం చదవడానికే కేటాయించాలని సూచించారు.కనీసం గంటపాటు క్రీడలకు సమయం కేటాయించాలని, దీనివల్ల ఒత్తిడి తగ్గుతుందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ రుచికరంగా ఉంటున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను కలియ తిరిగి కావాల్సిన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్ బాక్స్, 2 హాళ్లు, గ్యాప్ ఉన్నచోట్ల ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఏన్కూరు తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో రమేశ్, అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

**డ్రోన్ సర్వేను ప్రారంభించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్**


డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ పాటిల్

పాల్వంచ, ఫిబ్రవరి 27 : పాల్వంచ మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు డ్రోన్ సర్వే చేపట్టినట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయ ఆవరణలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, మున్సిపల్, సర్వే ఆఫ్ ఇండియా, డీటీసీపీ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్‌కు కలెక్టర్ పూజలు చేసి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని, భవిష్యత్ తరాలకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ కెమెరాల సాయంతో డిజిటల్ సర్వే పకడ్బందీగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్-2.0 పథకం కింద రాష్ట్రంలో 50 వేల నుంచి లక్ష జనాభా కలిగిన 20 మున్సిపాలిటీలను మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే కోసం ఎంపిక చేయగా.. అందులో పాల్వంచ మున్సిపాలిటీ ఉందన్నారు. జిల్లాలోనే మొదటిసారిగా పాల్వంచ మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ డిజిటల్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో డీటీసీపీవో నెల్లూరి సత్యనారాయణ, పాల్వంచ టీపీవో, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఖమ్మం రూరల్లో ఈసీ నిబంధనల ఉల్లంఘన

- ఏకంగా ఫ్లెక్సీలు పెట్టి మరీ ప్రచారం..
- 'నమస్తే' వెబ్‌లో కథనం ప్రచురితమయ్యాక తొలగించిన అధికారులు


పోలింగ్ కేంద్రం వద్ద ఓ సంఘం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 27 : ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. ఏదులాపురం మున్సిపాలిటీలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన 105వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 488 మంది టీచర్లు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. వీరిలో 461 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే, ఈ పోలింగ్ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తోడుగా ఆయా రాజకీయ పార్టీల నేతలు కూడా వచ్చి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహించారు. పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రధాన రహదారి వెంబడి భారీ టెంట్లు వేశారు. పోటీలో ఉన్న అభ్యర్థుల ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఎన్నికల సంఘం (ఈసీ) నిబంధనలు ఉల్లంఘించి మరీ టెంట్లకు ఇరువైపులా పలు జెండాలను, అభిమాన నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శించి ఓటర్లను ప్రభావితం చేశారు. ఇదే అంశంపై 'నమస్తే తెలంగాణ' వెబ్‌న్యూస్‌లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు తక్షణమే స్పందించారు. కొద్దిసేపటి తరువాత అధికారులు అక్కడికి చేరుకొని ఫ్లెక్సీలను, ఇతర ప్రచార పోస్టర్లను తొలగించారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ ముష్కారాజు కలిసి బందోబస్తు చేపట్టారు. ఎంసీసీ అధికారి ఎస్.కుమార్, ఆర్ఐ ప్రసాద్‌లు పోలింగ్ ప్రక్రియ తీరును పర్యవేక్షించారు.

## 'భద్రాద్రి'లో 91.94 శాతం పోలింగ్

- 2,022 మందికిగాను 1,859 మంది టీచర్ల ఓటు హక్కు వినియోగం
- సాయంత్రం 4 గంటల తర్వాత నల్లగొండకు తరలిన పోలింగ్ బాక్సులు
- లక్ష్మీదేవిపల్లి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్


లక్ష్మీదేవిపల్లి :రామచంద్రా డిగ్రీ కాలేజీ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్


కొత్తగూడెంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ భద్రాద్రి జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం నాలుగు గంటలు కాకముందే పూర్తయింది. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 2,022 మంది ఓటర్లుండగా వారిలో 1,859 మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 163 మంది ఓటు వేయడానికి రాలేదు. జిల్లాలో 23 మండలాల్లోని ఆయా పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రే ఏడు రూట్ల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రిని తరలించారు. ప్రతీ బస్సుతోనూ పోలీస్ ఎస్కార్ట్‌ను పంపారు.

### 91.94 శాతం పోలింగ్..

భద్రాద్రి జిల్లాలోని 23 మండలాల్లో అత్యధికంగా పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలం మండలాల్లో ఎక్కువమంది ఓటర్లు ఉన్నారు. ఉదయం 10 గంటలకు 174 మంది ఓటు వేయగా, 12 గంటలకు 939 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు 1,484 మంది, సాయంత్రం 4 గంటలకు 1,859 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ..

కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు వేర్వేరుగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం రామచంద్రా డిగ్రీ కాలేజీలో జరిగిన పోలింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సింగరేణి స్కూల్లో జరిగిన పోలింగ్ తీరును ఎస్పీ రోహిత్‌రాజు పరిశీలించారు. అన్ని రూట్లలోనూ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఓటింగ్ ముగిసిన అనంతరం పోలింగ్ బాక్సులకు ఎన్నికల అధికారులు సీల్ వేశారు. పీవో, ఏపీవోలు, రూట్ ఆఫీసర్లు, సెక్టార్ ఆఫీసర్ల ద్వారా బందోబస్తు మధ్య బస్సుల్లో ఈ పోలింగ్ బాక్సులను తీసుకెళ్లారు.

### నల్లగొండకు బ్యాలెట్ బాక్సులు: భద్రాద్రి కలెక్టర్

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఫిబ్రవరి 27 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ భద్రాద్రి జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. మొత్తం 91.94 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. పోలింగ్ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య బ్యాలెట్ బాక్సులను నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు తరలించినట్లు చెప్పారు.


కరకగూడెం మండలంలో పోలింగ్ పూర్తికావడంతో బాక్సులతో బస్సు వద్దకు వస్తున్న సిబ్బంది, పోలీసులు

## ఓసీ నీరే సాగునీరు..!

ఓసీ నీటితో వరినాట్లు వేసిన దృశ్యం



- 400 ఎకరాలకుపైగా నీరు అందిస్తున్న జీకే ఓసీ
- పీహెచ్ లెవల్ తక్కువ ఉండడంతో పంటలకు ఇబ్బంది
- తగ్గిపోతున్న దిగుబడులు.. చెరువుల్లో సైతం చనిపోతున్న చేపలు
- పీహెచ్ లెవల్ పెంచే పనిలో సింగరేణి యాజమాన్యం
- ఇబ్బంది పడుతున్న పెనగడప, రాంపురం గ్రామాల రైతులు

రామవరం, ఫిబ్రవరి 27 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని పెనగడప, రాంపురం రైతుల పంటలకు సాగునీరు అందడం లేదు. ఆర్థిక పరిస్థితి బాగున్న రైతులు బోర్ల ద్వారా వ్యవసాయం చేస్తుండగా.. మిగతా రైతులు సమీపంలోని ఎర్రచెరువు, పెద్దచెరువు, క్రిష్ణారాయుడు చెరువులపైనే ఆధారపడుతున్నారు. ఈ ఏడాది అనుకున్నంత వర్షాలు లేకపోవడంతో చెరువులన్నీ ఎండిపోయాయి. దీంతో సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే(గౌతమ్ ఖని) ఓసీ నుంచి బయటికి పంపిస్తున్న నీరే వారికి గతి. ఈ నీటినే సాగునీరుగా వాడుకొని వరి రెండు పంటలు పండించుకుంటున్నారు. అయితే ఓపెన్‌కాస్ట్ నీటిలో పీహెచ్(పొటెన్షియల్ ఆఫ్ హైడ్రోజన్) లెవల్స్ తక్కువగా 3 శాతమే ఉండడంతో పంటలకు ఇబ్బందిగా మారుతున్నది. జీకే వోసీ మూసివేయడంతో అందులోని నీటిని పంపుల ద్వారా అధికారులు బయటికి పంపిస్తుంటారు. ఈ నీటిని సమీపంలోని ఎర్రచెరువు, పెద్దచెరువు, క్రిష్ణారాయుడు చెరువుల్లోకి విడుదల చేస్తారు. అయితే ఓసీలో నీరు నిల్వ ఉండడంతో మైనింగ్‌కు సంబంధించిన ఐరన్ పైరటీస్ చేరి చిలుము నీరుగా మారడమే కాకుండా ఆ నీటిలో పీహెచ్ లెవల్స్ సైతం తక్కువగా ఉంటున్నాయి. ఈ ప్రాంత రైతులకు వేరే దిక్కు లేకపోవడంతో ఈ నీటిని వాడడంతో పంట దిగుబడి తగ్గిపోతున్నది. అంతేకాక క్రిమిసంహారక మందులను ఈ నీటిలో కలిపి వాడితే పనిచేయడం లేదని, చెరువుల్లో చేపలు కూడా చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓసీ నుంచి ఇచ్చే నీరు సాగునీరుకు ఉపయోగపడే విధంగా ఉండాలని గతంలో కలెక్టర్, ఎన్విరాల్‌మెంట్ అధికారులకు రైతులు ఫిర్యాదులు చేశారు. ఇన్ని వందల ఎకరాలకు నీరు అందిస్తున్న సింగరేణి యాజమాన్యం పీహెచ్ లెవల్‌ను పెంచే పరికరాలు, సౌలభ్యాలు అందుబాటులోకి తెచ్చి తమ పంటలకు సాగునీరును అందించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

### పీహెచ్ లెవల్ పెంచే పనిలో యాజమాన్యం..

జీకే ఓసీలో ప్రతిరోజు ఉబికి వస్తున్న ఊట(జల)ను 240 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు మోటార్ల ద్వారా 10 లక్షల గ్యాలన్ల నీటిని తోడిపోస్తున్నారు. గతంలో మైనింగ్ కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ఈ నీటిని వాడేవారు. ప్రస్తుతం జీకే ఓసీలో నిర్దేశించిన బొగ్గు నిల్వలు తీసివేయడంతో మైనింగ్ మూతపడింది.. దీంతో మైనింగ్‌లో వస్తున్న నీటిని రైతులు అడిగిన నేపథ్యంలో సమీపంలోని చెరువుల్లోకి తరలిస్తున్నారు. ఈ నీటిలో ఉండే పీహెచ్ లెవల్ 3 శాతం ఉండడంతో క్యాల్షియం హైడ్రాక్సైడ్‌ను కలిపి 6 శాతానికి పెంచి సాగునీరుగా ఉపయోగపడేలా సింగరేణి యాజమాన్యం చూస్తున్నది. ప్రతిరోజు మూడు షిఫ్టుల ద్వారా ఆరుగురు డీఎల్‌ఆర్ కార్మికులను నియమించి, 300 టన్నుల క్యాల్షియం హైడ్రాక్సైడ్‌ను టన్ను 30 వేల చొప్పున కొని కలుపుతున్నట్లు సింగరేణి అధికారులు చెబుతున్నారు. ఐనా పీహెచ్ లెవల్ పెరగడంలేదనే అభ్యర్థనలు తమకు వస్తున్నాయని, దీనికోసం త్వరలో మెకానికల్ మిక్సింగ్ యూనిట్ లేదా అధునాతనంగా వచ్చే చిప్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. గత 30 సంవత్సరాల నుంచి సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోని చెరువులకు నీటిని తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

### చిలుము లేకుంటే బాగుండు..



ఎర్రచెరువు కింద నాకు రెండు ఎకరాల భూమి ఉంది. గతంలో ఓసీ నుంచి నీరు మంచిగా వచ్చేది. కొన్నిరోజులుగా చిలుము నీరు ఎక్కువగా వస్తున్నది. ఈ నీటిని వాడితే పంట దిగుబడి తగ్గిపోతుంది. కానీ మాకు వేరే దిక్కు లేదు. అధికారులు పట్టించుకొని ఆ నీటిని వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా అందిస్తే బాగుంటుంది. – చింత రమేష్, పెనగడప రైతు

